క్లుప్తంగా

ఘనంగా మరిడమ్మతల్లి జాతర



ఎస్.పైడిపాలలో మరిడమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలలో మరిడమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఏటా ఉత్తర కార్తెలో వచ్చే ఆదివారం రోజున అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు



కోటనందూరులో భోజనాలు చేస్తున్న భక్తులు

కోటనందూరు: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక అల్లూరి సీతారామరాజుకాలనీలో ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. గ్రామ పెద్దల సహకారంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

తొండంగిలో...

తొండంగి: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా స్థానిక పాత సినిమా హాల్ సెంటర్‌లో వినాయకుని ఆలయం వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతలు, గ్రామ పెద్దల సహకారంతో సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేశారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో అన్నసమారాధనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



జగ్గంపేట ముక్తార్‌బాషా వర్ధంతి సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

జగ్గంపేట: కార్మిక హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసి అసువులు బాసిన ముక్తార్ బాషా వర్ధంతి సభ ఈ నెల 26వ జగ్గంపేట స్టాలిన్ భవనంలో నిర్వహించనున్నట్టు టైల్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయుకుడు మరుకుర్తి ఏసు తెలిపారు. జగ్గంపేట స్టాలిన్ భవనంలో ముక్తార్ బాషా వర్ధంతి సభ వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఓఎల్ రాష్ట్ర నాయకులు చిట్టిబాబు, జిల్లా నాయుకులు జి.బాలరాజు, మహిళాసంఘం నేతలు కె.లక్ష్మి, శాంతి పాల్గొన్నారు.

పేదల భూములు కాజేసేందుకు కుట్ర

ప్రత్తిపాడు: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను కాజేసేందుకు భూ మాఫియా ముఠాలు కుట్ర పన్నుతున్నాయని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు ఆరోపించారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దాపురం డివిజన్‌లోని తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, జగ్గంపేట మండలాల్లో వివిధ గ్రామాల్లోని డీఫారం పట్టా భూములు, సీలింగ్ భూములు, ఆచార్య వినోబావే భూదాన యజ్ఞంలో భూస్వాముల నుంచి సేకరించి పేదలకు ఇచ్చిన భూములను కాజేయడానికి భూ మాఫియా ముఠాలు గ్రామాల్లో పర్యటిస్తున్నాయన్నారు. రెవెన్యూ సిబ్బంది నుంచి ఈ భూముల వివరాలు సేకరించి, భూములు పొందిన వారసులను మభ్య పెట్టి, వారి నుంచి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం పెద్దాపురం డివిజన్ పరిధిలో ఈ వ్యవహారం పెద్ద ఎత్తున జరుగుతోందన్నారు. కలెక్టర్ తదితర జిల్లా స్థాయి అధికారులు డి ఫారం పట్టాదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న హక్కులపై అవగాహన కల్పించాలని కోరారు. భూ మాఫియాతో కుమ్మక్కై తప్పుడు నివేదికలు తయారుచేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

కిర్లంపూడి: తామరాడ గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై పి.ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... తామరాడ గ్రామ శివారు పంట కాలువ గట్టుపై పేకాడుతున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.14480 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్టు ఎస్సై తెలిపారు. పోలీస్ సిబ్బంది సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛమేవ జయతే..



కోటనందూరులో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



బొద్దవరం డ్రైనులో పూడిక తీస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

- సత్ఫలితాలను ఇస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు
- శుభ్రత, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన
- సీజనల్ వ్యాధులను తరిమికొట్టడమే లక్ష్యం

కోటనందూరు: వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులను తరిమికొట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే పల్లెల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించింది. పంచాయతీ, గ్రామీణ నీటి పారుదల, వైద్య ఆరోగ్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో పలు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ర్యాలీలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రజలు గుమికూడే ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి అన్ని వర్గాల ప్రజలను అప్రమత్తం చేశారు. పల్లెల్లో అపరిశుభ్రతను పారద్రోలేందుకు ప్రభుత్వ అధికారులతో యువత, విద్యావంతులు, మహిళలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ అనంతరం పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ప్రభుత్వ చర్యల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



బిళ్లనందూరులో వైద్య శిబిరం

ఏటా వ్యాధుల గాలం

ఏటా వర్షాకాలంలో వ్యాధుల పెచ్చుమీరుతున్నాయి. మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ, ఫైలేరియా వంటి రోగాలతో గ్రామీణులకు అవస్థలు తప్పడం లేదు. దోమలు, ఈగలు ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు ప్రజలను కష్టాల్లోకి నెట్టుతున్నాయి. నీటి కాలుష్యంతో అతిసారం, టైఫాయిడ్ వంటి వ్యాధులు సంభవిస్తున్నాయి. తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు మృత్యువాత పడే పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమించింది.

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా..

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని 213 పంచాయతీల పరిధిలో ప్రభుత్వం వివిధ రూపాల్లో పారిశుధ్య పనులు నిర్వహించింది. డ్రైనేజీల్లో పూడికతీసి శుభ్రపరచడం, వర్షపునీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు చేపట్టడం, డ్రై డే పాటించడం, ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రపరచడం వంటివి చేశారు. లోతట్టు, మురుగు ప్రాంతాల్లో యాంటీ లార్వా, దోమల నివారణ మందు పిచికారీ చేయడం, నీరు తొలగించుటకు అవకాశం లేని గుంటలు, పాంత్రాల్లో ఆయిల్‌బాల్స్, గంబూషియా చేపలను విడిచిపెట్టడం, రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తొలగించి ఎక్కడికక్కడ బ్లీచింగ్ చల్లించడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పల్లె ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు మంచినీటి సరఫరా పైపులైన్లకు మరమ్మతులు చేయించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

మండల వ్యాప్తంగా వైద్య సిబ్బంది ఫీవర్ సర్వేతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. పల్లెల్లో మందులతో పాటు వైద్య సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

పకడ్బందీగా పారిశుధ్య పనులు



ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాం. సీజనల్ వ్యాధులకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాం. పైపులైను లీకేజీలు నివారించడం, ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్‌లెవెల్ ట్యాంకులు క్లీన్ చేయడం, పంచాయతీ కుళాయిల వద్ద శుభ్రం చేయడం ద్వారా సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నాం. డ్రైన్లలో పూడిక, రోడ్ల వెంబడి చెత్తను తొలగించి పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణం సృష్టించాం.

– అరుణకుమార్, ఈఓపీఆర్డీ, కోటనందూరు

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు



వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నాం. ఇంటింటా పర్యటించి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేలా సిబ్బందిని ముందస్తుగా అప్రమత్తం చేశాం. అక్టోబర్ నెలాఖరు వరకూ పీహెచ్‌సీ పరిధిలో విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించి వ్యాధులను అదుపు చేసేందుకు పక్కా ప్రణాళికను రచించాం.

– డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, వైద్యాధికారి, కోటనందూరు పీహెచ్‌సీ

రోగులకు మెరుగైన సేవలందించాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరసింహనాయక్



కోటనందూరు పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంఅండ్ హెచ్‌ఓ నరశింహనాయక్

కోటనందూరు: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరసింహనాయక్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీని ఆదివారం ఆయన సందర్శించారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రసవాలు, ఓపీ, రోగులకు చేస్తున్న పరీక్షలు, కల్పిస్తున్న సౌకర్యాలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శినితో చర్చించారు. విధి నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం బిళ్లనందూరులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలించారు. ఆయన వెంట డీఎంఓ భాస్కర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో చేపట్టిన పీహెచ్‌సీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాకినాడ జిల్లా వైద్యాధికారి జె.నరసింహనాయక్ సూచించారు. మండలంలోని ములగపూడి, శృంగవరం గ్రామాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ములగపూడిలో పీహెచ్‌సీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలో మౌలిక సదుపాయలను మెరుగు పరిచి నిత్యం ప్రజలకు వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని శృంగవరంలో పర్యటించి కో లొకేటెడ్ పీహెచ్‌సీ ఏర్పాటుపై స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో వైద్యులు సౌజన్య, సరోజిని, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఎ.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

శంఖవరం: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ నరసింహనాయక్ సూచించారు. స్థానిక పీహెసీని ఆదివారం ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఆసుపత్రిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంఓ భాస్కరరావు, వైద్యుడు శెట్టిబత్తుల రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయం

- మాజీ మంత్రి తోట నరసింహం
- యల్లమిల్లిలో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

గండేపల్లి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా అందరం కృషి చేద్దామని మాజీ మంత్రి తోట నరసింహం పిలుపునిచ్చారు. మండలంలోని యల్లమిల్లిలో ఆయన అనుచరులు సుంకవిల్లి బాబ్జి, వీర్రాజు, మంగిన రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ గుల్లా ఏడుకొండలు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ డైరెక్టర్ గఫూర్, పార్టీ నాయకులు తులా రాము, అత్తులూరి సాయిబాబు, తొండాపు రమణారెడ్డి, కందిరెల్లి కామేష్, తోట అయ్యన్న, బాబ్జి, పలికల గంగరాజు, తొండాపు రఘురాం తదితరులు పాల్గొన్నారు.

నాట్య గణపతిగా దర్శనమిచ్చిన వినాయకుడు



రత్నగిరిపై నాట్య గణపతి అలంకరణలో స్వామివారు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం వినాయకుడు నాట్యగణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. నీలం వర్ణఛాయతో పట్టువస్త్రాలు ధరించి ఏడు శిరస్సుల తాచు పాము మీద నిలబడి నృత్యం చేస్తున్నట్టుగా గణపతి భక్తులను అలరించారు. పండితులు ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు గణపతికి పుష్పాలు, గరికతో పూజలు చేశారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలను సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

తుని రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా జరుగుతోందని ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. ఈ నెల 30 నుంచి నవంబర్ ఒకటి వరకు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు 15 రోజుల ముందు నుంచి వలంటీర్లు యాప్‌లో సర్వే వివరాలను నమోదు చేస్తున్నట్టు తెలిపారు. అందుకు అనుగుణంగా వైద్యసేవలు, మందులను అందిస్తామన్నారు. చామవరం, డి.పోలవరం, టి.తిమ్మాపురం, హంసవరం, కుమ్మరిలోవ గ్రామాల్లోని సర్వే వివరాలను ఇప్పటికే యాప్‌లో నమోదు చేశారన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు సహకరించాలని కోరారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు నరాల శ్రీను సూచించారు. మండలంలోని నెల్లిపూడి, కొంతంగి, వజ్రకూటం గ్రామాలో ఆదివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారి పూర్తి వివరాలు సేకరించారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు



ఏలేశ్వరం ఏలేరు కాలువ వద్ద పోలీసుల ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



పంపా స్నానఘట్టాల వెలుపల గణపతి నిమజ్జనానికి ఏర్పాటు చేసిన ర్యాంపు

తుని: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరడంతో తాండవ నదిలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు శాఖల సమన్వయంతో కొట్టాం సెంటర్ తాండవ నది వద్ద ర్యాంపు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీలకు ముందుగానే అధికారులు పలు సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ర్యాంపుతో పాటు క్రేన్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. పరిమిత సంఖ్యలో మాత్రమే భక్తులకు ఊరేగింపులో అనుమతి ఇచ్చామని సీఐ గీతా రామకృష్ణ తెలిపారు.

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల్లో భాగంగా వినాయక విగ్రహాల నిమజ్జనానికి స్థానిక ఏలేరు నదిలో ఆదివారం ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక బ్రహ్మణ రేవు వద్ద విగ్రహాల నిమజ్జనం సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఎస్సై జి.సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఏలేరు నదిలో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి సమీపంలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఏలేరు కాలువలో జేసీబీ సాయంతో గోతులను పూడ్చి పూడికను తొలగించారు. నిమజ్జనంలో భక్తులు పోలీసులు సూచించిన జాగ్రత్తలు పాటించాలని ఎస్సై కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంపా నదిలో గణపతి నిమజ్జనాలకు రంగం సిద్ధం

అన్నవరం: పంపా నదిలో గణపతి నిమజ్జనాలకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచి బుధవారం వరకూ పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలు పంపా నదీలో నిమజ్జనం చేయనున్నారు. నదీజలాలు కలుషితం కాకూడదనే ఉద్దేశంతో ఈసారి పంపా నదీలో స్నానఘట్టాల వద్ద కాకుండా గేటుకు ఇవతల నది ఒడ్డున నిమజ్జనాలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గేటు వెలుపల పంపా గట్టును జేసీబీతో తవ్వి ర్యాంపు ఏర్పాటు చేసినట్లు దేవస్థానం ఈఈ నర్సింహారెడ్డి తెలిపారు. గణపతి విగ్రహాలను ఆ ర్యాంపు వద్ద జేసీబీ ద్వారా నదిలో నిమజ్జనం చేస్తారు. అనంతరం స్నానఘట్టాల్లో భక్తులు స్నానాలు చేసేందుకు వీలు కల్పించారు. నదిలో లోపలికి వెళ్లి స్నానాలు చేయకుండా ఘాట్‌ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు.

బైబై గణేశా...



సూరంపాలెంలో గణపతిని ఊరేగిస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల ముగింపులో భాగంగా వినాయక విగ్రహాలను ఆదివారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పలు చోట్ల నెలకొల్పిన వినాయక విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించి స్థానిక ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. స్థానిక పల్లపువీధి, తోటవీధి, లింగంపర్తి తదితర గ్రామాల్లోని వినాయక విగ్రహాలను తీన్‌మార్, బ్యాండ్‌మేళం, బాణసంచా కాల్పుల నడుమ ఘనంగా ఊరేగించారు. స్థానిక మెయిన్ రోడ్డు, బాలాజీ చౌక్, మార్కెట్ రోడ్డు, పల్లపువీధి మీదుగా ఊరేగింపుగా తీసుకువచ్చి ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు. నిమజ్జనాల్లో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

గండేపల్లి: గణపతి నిమజ్జనోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. గ్రామాల్లో వినాయ చవితి సందర్భంగా వారం రోజుల పాటు గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. బ్యాండ్ మేళాలు, తీన్ మార్ డ్యాన్సుల నడుమ ఊరేగించి చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. సూరంపాలెం ఆదిత్య కళాశాలలో నెలకొల్పిన గణపతిని వైభవంగా ఊరిగించి నిమజ్జనం చేశారు. ఊరేగింపులో విద్యార్థులు సందడి చేశారు. కళాశాల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జ్ మేడపాటి భాస్కరచంద్రారెడ్డి, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం గణేశ్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

వేటకు విరామం



దానవాయిపేట సముద్రతీరంలో నిలిపివేసిన బోట్లు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రంలో చేపల వేటకు మత్స్యకారులు విరామం ఇచ్చారు. అల్పపీడనం ప్రభావంతో కొద్ది రోజులుగా సముద్రంలో అలలు ఎగసి పడుతున్నాయి. ప్రతికూల వాతావరణంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని ప్రభుత్వం సూచించింది. దీంతో మత్స్యకారులు వేటను నిలిపివేశారు. అద్దరిపేట, దానవాయిపేట, యర్రయ్యపేట, కొత్తపేట, పంపాదిపేట, కొత్తచోడిపల్లిపేట తదితర ప్రాంతాల్లో మత్స్యకారులు బోట్లను తీరంలో సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. అనుకూల వాతావరణం ఏర్పడే వరకూ వేటకు వెళ్లే పరిస్థితి లేదని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. అప్పటి వరకూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యారంగం రక్షణకు యూటీఎఫ్ కృషి



గోకవరంలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించిన నాయకులు

గోకవరం: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటానికి యూటీఎఫ్ ఎల్లవేళలా కృషి చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. యూటీఎఫ్ 50వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అక్టోబర్ 1న విజయవాడలో నిర్వహించే స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకూ చేపట్టిన ప్రచార జాతా ఆదివారం గోకవరం చేరుకుంది. ఈ జాతాకు మండల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అనిల్‌కుమార్, కె.శ్రీనివాసు స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం సమీపంలో యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకురాలు దేవవాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పాత పెన్షన్ విధానం సాధన కోసం కలిసి వచ్చే అన్ని సంఘాలతో కలిసి యూటీఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి, అధిక సంఖ్యలో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జగ్గంపేటకు నారా భువనేశ్వరి

జగ్గంపేట: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడి అరెస్టు నేపథ్యంలో జగ్గంపేటలో ఆ పార్టీ శ్రేణులు నిరహార దీక్షలు చేస్తున్నారు. కాగా సోమవారం ఈ దీక్షలో చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, లోకేష్ సతీమణి బ్రాహ్మణి పాల్గొంటారని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. నిరహార దీక్ష అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించే అన్నదానంలో పాల్గొంటారని చెప్పారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోటనందూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బాలుర అండర్-14 విభాగంలో 8 మంది, అండర్-17 విభాగంలో 9 మంది, బాలికల అండర్-14 విభాగంలో ఐదుగురు, అండర్-17 విభాగంలో ఆరుగురు వెరసి మొత్తం 28 మంది విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారు. క్రీడా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను హెచ్ఎం వేణుగోపాల్, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి కనక దుర్గ శ్రీను, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీసాయి విద్యార్థుల ప్రతిభ

స్థానిక శ్రీసాయి విద్యానికేత్ విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచారు. అండర్-14, 17 విభాగాల్లో ఎం.చంద్రిక, ఎస్.జాహ్నవి, రామ్‌చరణ్, నరేంద్ర, తరుణ్ ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను విద్యాసంస్థల అధినేత బి.లక్ష్మి అభినందించారు.

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు నియోజకవర్గ స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చినట్టు హెచ్ఎం లక్ష్మీకాంతం, పీఎంసీ చైర్మన్ పి.చిన్ని తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో త్రోబాల్, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో 17 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. కీడా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ జగదీష్‌ని ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

కిర్లంపూడి: మండలంలోని సోమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం కాంతారావు తెలిపారు. మండలంలోని రాజుపూడి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో అండర్ 14 వాలీబాల్ విభాగంలో కె.వీరబాబు, అండర్ 17 వాలీబాల్‌లో బి.లోవరాజు, అండర్ 17 కబడ్డీ, ఖోఖో పోటీల్లో ఎం.గంగాభవానీ, డి.ఐశ్వర్య, ఎస్.రాజేష్ ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, పీడీ శివానిని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.